సాక్షి చిత్తూరు

గురువారం । 7 । ఆగస్టు । 2025



కుంకీ ఆపరేషాన్
కుంకీలతో మదపుటేనుగులను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసిన కుంకీ ఆపరేషన్ కొనసాగుతోంది. - 8లో



ప్రతి ఫైల్ ఈ-ఆఫీస్‌లోనే...
జిల్లాలోని అన్నిశాఖల అధికారులు ప్రతి ఫైల్‌ను ఈ-ఆఫీస్‌లోనే పంపాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



సాంకేతికతకు అనుగుణంగా..
సాంకేతికతకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు కాణిపాకానికి ఏపీ హైకోర్టు జడ్జి

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి గోపాల్ కృష్ణారావు ఈనెల 8వ తేదీన కాణిపాకానికి రానున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన 8వ తేదీ ఉదయం 10 గంటలకు కాణిపాకంకు వస్తారన్నారు. కుటుంబ సమేతంగా శ్రీ వరసిద్ది వినాయక స్వామిని దర్శించుకుంటారన్నారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుని ఉదయం 11.30 గంటలకు తిరుపతి జిల్లా తిరుచానూరుకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీపై దాడి దారుణం


ఎమ్మెల్సీ భరత్

కుప్పం : కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయడం దారుణమని కుప్పం సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ ఖండించారు. బుధవారం పులివెందుల ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్గొండవారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ నేతలు ఆయన కాన్వాయ్‌పై దాడి చేసి కారును ధ్వంసం చేయడం దుర్మార్గం అన్నారు. ప్రజాప్రతినిధులకు రక్షణ లేకుండా కూటమి ప్రభుత్వం నడుచుకోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 6 ఫిర్యాదులు

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమానికి మొత్తం 6 ఫిర్యాదులు వచ్చాయి. కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు పరంగా రివిజన్ ఆఫ్ బిల్లు, సంతపేట పరంగా కేటగిరి మార్పు, గుడిపాల, కొత్తపల్లెలో ఫోన్ నంబర్ మార్పు, సర్వీసు పేరు మార్పు పరంగా ఫిర్యాదులు వచ్చాయని ఏఈ మాధురి పేర్కొన్నారు. ఇందులో 4 సమస్యలు పరిష్కరించామని మరో రెండు పరిశీలన దశలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు రూరల్ సెక్షన్ ఏఈ రాజా పాల్గొన్నారు.

'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం'

– ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య


ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తున్న జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివయ్య

ఐరాల : ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.ఆర్.సూర్యనారాయణ విన్నూతంగా 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు. బుధవారం కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నేరవేర్చకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేల కోట్లు ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని, కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించకపోవడం శోచనీయమని తెలిపారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించే పరిస్థితుల్లో లేనందున ప్రత్యామ్నాయంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలుగా కేటాయించి వారికి ఇవ్వాల్సిన బకాయిలు జమ చేసుకోవాలని కోరారు.

వచ్చే వారం మద్యం బార్ల నోటిఫికేషన్

చిత్తూరు అర్బన్ : నూతన మద్యం పాలసీ బార్లకు వచ్చే వారం నోటిఫికేషన్ ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తం పది మద్యం బార్లు ఉన్నాయి. చిత్తూరులో 7, పలమనేరు, కుప్పం, నగరిలో ఒక్కో మద్యం బారు ఉంది. వీటి లైసెన్సులు ఈనెలాఖరుకు ముగియనుంది. లైసెన్సులను రెన్యువల్ చేయడానికి ఇష్టపడని కూటమి ప్రభుత్వం.. నూతన లైసెన్సుల మంజూరుకే మొగ్గుచూపుతూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. నూతన పాలసీ ప్రకారం మద్యం బార్లను టెండర్లు పిలిచి, ఓ బారుకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో లైసెన్సులు జారీ చేయనున్నారు. ఇందులో ఓ దుకాణాన్ని కల్లుగీత కులాలకు రిజర్వు చేయనున్నారు. కొత్త పాలసీ ద్వారా దరఖాస్తు రుసుముల నుంచి రూ.50 లక్షలు, లైసెన్సు ద్వారా రూ.5 కోట్ల ఆదాయం సమకూరనుంది. 2028 ఆగస్టు 31వ తేదీ వరకు లైసెన్సులు చెల్లుబాటులో ఉంటాయి.

చేనేత రంగానికి చేయూత అందించే దిశగా గత ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ఏటా రూ.24 వేలు అందించేవారు.. కానీ కూటమి ప్రభుత్వం నేతన నేస్తం లేకుండా కేవలం 200 యూనిట్లకు ఉచిత విద్యుత్‌తోనే సరిపెడుతోంది. 200 యూనిట్లకు లెక్కగడితే వీటి మొత్తం రూ.12 వేలే అవుతుంది. గత ప్రభుత్వంలో ఇచ్చే రూ.24 వేలకు బదులు నేడు రూ.12 వేలతోనే కంటి తుడుపుగా ఉచిత విద్యుత్ అంటూ నేతన్నలను కూటమి ప్రభుత్వం మరోసారి దగా చేస్తోంది.

చేనేతకు దక్కని చేయూత

- ప్రభుత్వం ఇచ్చేది మూరెడు.. తీసేసింది బారెడు
- రూ.24 వేల నేతన్న నేస్తం కనుమరుగు
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కంటితుడిపే
- ఉచితం అంటూనే మోసం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం


మాంగాడులో చేనేత మగ్గం నడుపుతున్న చేనేత కార్మికుడు

నేతన్నకు దగా!



నగరి : చేనేతను పరిష్కారం కాని డిమాండ్లు వేధిస్తూనే ఉన్నాయి. వ్యవసాయం తరువాత అధిక జనాభా ఉపాధి పొందుతున్న రంగమైన చేనేత నిలదొక్కుకోవాలంటే కావాల్సిన సాయం బారెడు ఉంటే ప్రభుత్వం 200 ఉచిత యూనిట్ల రూపంలో అందించే సాయం బెత్తెడు మాత్రమే. ఉమ్మడి జిల్లాలో చేనేత‌పై ఆధారపడి సుమారు 5 వేల కార్మికులు ఉండగా 15 వేల మంది ఈ వృత్తిపై పరోక్షంగా జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తూ చేనేత కార్మికులను ఆదుకుంది. ఇలా చిత్తూరు జిల్లాలో 194 మంది చేనేత కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందగా తిరుపతి జిల్లాలో 4,144 మంది ఈ పథకంలో ప్రయోజనం పొందారు. ప్రభుత్వం మారడంతో నేతన్న నేస్తం అటకెక్కింది. ఏడాది కాలంగా వారికి ఎలాంటి సాయం అందలేదు.

చేనేత కార్మికుల సంఖ్య తగ్గింపు

గతంలో చిత్తూరు జిల్లాలో 194 మందికి, తిరుపతి జిల్లాలో 4144 మందికి నేతన్న నేస్తం అందించే వారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4338 మందికి నేతన్న నేస్తం పథకంలో ఏడాదికి 10.41 అయితే నేడు ఉచిత విద్యుత్‌కు చేనేత, జవుళి శాఖ ఏడీ నుంచి ఉచిత విద్యుత్‌కు వచ్చిన జాబితాలో 1663 మందిని మాత్రమే అర్హులుగా నిర్ణయించారని చేనేత సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాలుగు వేల మందికిపైగా నేతన్న నేస్తం గుర్తించినా ఇంకా ఎంతో మంది ఉన్నారని వారందరికీ నేతన్న నేస్తం ఇవ్వలేదని గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు నేడు లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయినా నోరు మెదపడం లేదని అంటున్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకు రావడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ అది పూర్తి స్థాయిలో అందరికీ అందించాలని కోరుతున్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా మరోమారు వారు తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు.

ఏడాదికి లాభం రూ.12 వేలే

ఒడుదొడుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ వచ్చిన చేనేత రంగానికి ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చే సహకారం అంతంత మాత్రమే. నెలకు 200 యూనిట్లకు గరిష్టంగా లెక్కించినా సుమారు రూ.800 నుంచి రూ.1000 అవుతుంది. ఈ లెక్కన ఏడాదికి వారికి కలిగే లాభం రూ.12 వేల వరకు మాత్రమే ఉంటుంది. ఇందులోనూ ఇప్పటికే విద్యుత్ బిల్లులు ఎడాపెడా పెంచేశారు. అభ్యంతరకరమైన స్మార్ట్ మీటర్లను బిగిస్తూ వస్తున్నారు. దీంతో ఉచిత విద్యుత్ ద్వారా చేనేతకు కలిగే లబ్ధి అంతంత మాత్రమే ఉంటుంది. గతంలో ఇచ్చిన విధంగా నేతన్న నేస్తం క్రమం తప్పకుండా అందిస్తే ఏటా రూ.24 వేలు వచ్చేది. వాటితో నేతన్నలు ఫెడల్ లూమ్స్, నూతన డిజైన్లు ఇచ్చే జక్కార్డ్‌లు, బాబిన్లు కొనుగోలు చేసుకునేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక ఏడాది నేతన్న నేస్తము, ఉచిత విద్యుత్ లేకనే గడిచిపోయింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలో చేనేతలు పొందిన లబ్ధి వివరాలు

లబ్ధి పొందిన నేత కార్మికులు :	4338
నేతన్న నేస్తం :	రూ.10.41 కోట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ప్రభుత్వంలో చేనేతలు పొందిన లబ్ధి వివరాలు

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత పొందినవారు :	1663
ఏడాదికి లబ్ధి సుమారుగా :	రూ.1.99 కోట్లు

చేనేత కార్మికులు ప్రతిపాదిస్తున్న డిమాండ్లు ఇవీ

- చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అమలు చేయాలి.
- మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తింపజేయాలి.
- చేనేత వస్త్ర ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తి వేయాలి.
- కాటన్, సిల్క్ జరీలపై 50 శాతం రాయితీ ఇవ్వాలి.
- చేనేత కార్మికులకు 45 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేయాలి.
- చేనేత అనుబంధ వృత్తుల వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.
- చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, సంఘాలను బలోపేతం చేయాలి.
- త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.
- ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- ముద్రా స్కీము కింద రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి.
- చేనేత కార్మికులకు గృహం, వర్క్‌షెడ్ పథకం అమలు చేయాలి. ఇల్లు లేని చేనేతలకు మూడు సెంట్ల స్థలంతో ఇంటి స్థలాలను కేటాయించాలి. వర్క్ షెడ్డు కోసం అందనంగా రూ. 50 వేలు అందించాలి.
- ఎల్ఐసీ ద్వారా మహాత్మా గాంధీ బంకర్ బీమా యోజన పథకం పునరుద్ధరించాలి.
- మాస్టర్ వీవర్లు, చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రభుత్వం మార్కెట్ వసతులు కల్పించాలి.
- చేనేత రిజర్వేషన్ చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలి.
- చేనేత కార్మికులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలి.
- చేనేత గ్రామాల్లో చేనేత క్లస్టర్లు అమలు చేయాలి.

చేనేతపై ఆధారపడిన వారిని అర్హులుగా గుర్తించాలి



"చేనేత రంగం ఒడుదొడుకుల మధ్యే ముందుకుపోతోంది. బలోపేతం చెయ్యాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రస్తుతం 200 యూనిట్లు ప్రభుత్వం ఉచితంగా అందించడం హర్షణీయం. అయితే చేనేతపై ఆధారపడిన అందరినీ అర్హులుగా గుర్తించాలి. వీటితో పాటు గతంలో ఇచ్చిన విధంగా నేతన్న నేస్తం అందించాలి. ప్రభుత్వానికి చేనేత వస్త్రాలకు జీఎస్టీ మినహాయించాలి. చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేసి, ఉపాధికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలి. నూలు, సిల్క్, జరీలకు 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయాలి. రాష్ట్ర చేనేత అభివృద్ధి మండలి ఏర్పాటు చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలి.

– ఆకుల వాసు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్ అధ్యక్షుడు

ఎంపీ విడుదల కోసం పూజలు


పూజల్లో పాల్గొన్న నాయకులు

సదుం : అక్రమ కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వెంటనే విడుదల కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పాలమంద పెద్దూరు గంగమ్మ ఆలయం, ఊటుపల్లె పంచాయతీ పుట్టావారిపల్లె మల్లికార్జున స్వామి ఆలయంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మద్యం పాలసీతో సంబంధంలేని ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం వేధింపులలో భాగమని తెలియజేశారు. ఇలాంటి తప్పుడు కేసులకు పెద్దిరెడ్డి కుటుంబం ఎన్నడూ భయపడదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం ఎప్పుడూ పోరాడుతుందని వెల్లడించారు. అక్రమ కేసుల నుంచి ఎంపీ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, సర్పంచ్‌లు హనుమంత రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, ఎల్లప్ప, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, మల్లికార్జున, నారాయణ రెడ్డి, వెంకటస్వామి, పుత్రాజు, ఎల్లారెడ్డి, గిరిధర్ రెడ్డి, శివారెడ్డి, సీతాపతి పాల్గొన్నారు.

పల్లెల్లో మౌలిక వసతులు కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, హాజరైన అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : పల్లెలో కాలువలు, రోడ్లు , నీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సీఈఓ రవికుమార్‌నాయుడుతో కలిసి జెడ్పీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 15వ ఆర్థిక సంఘం, జెడ్పీ సాధారణ నిధుల కింద తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. మండలాల్లో పలు నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ కాలనీలు, లే అవుట్ల నందు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో కలిసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓలు మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసి జెడ్పీ సీఈఓకు ఇవ్వాలని ఆదేశించారు. ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అందుకు సంబంధించిన శాఖ అధికారులు త్వరితగతిన నాణ్యమైన పనులు చేపట్టాలని కోరారు. పలు గ్రామాల్లో పనులు జరగకపోతే ఆ నివేదికను సీఈఓకు అందించాలన్నారు. నెలలోపు పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులలో రూ.146 కోట్ల అంచనా విలువగల 204 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీటికి సంబంధించి రూ.93.17 కోట్ల అంచనా విలువగల 257 పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిర్దేశిత కాలంలోపు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, ఎంపీడీఓలు, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

అపచారాలు ఎత్తిచూపితే నాస్తికులా?


మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: టీటీడీలో జరుగుతున్న అనర్థాలు, అపచారాలను ఎత్తి చూపితే నాస్తికులైపోతారా? అని టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడిని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొల్లినేని రాజగోపాల్‌నాయుడు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి పదిహేను నెలలు అవుతున్నా టీటీడీలో అన్నీ అపచారాలు, ఘోరాలు తప్ప ఒక మంచి పనైనా చేశారా? అని ప్రశ్నించారు. టీటీడీలో సంపూర్ణ ప్రక్షాళన చేస్తానని చెప్పి శ్రీవాణి ట్రస్టు, తొక్కిసలాట, గోవుల మృతికి సంబంధించి తమపై ఆరోపణలు చేసి, కాలం గడపతమే తప్ప ప్రక్షాళన విషయంలో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎంతసేపూ వైఎస్సార్‌సీపీపై, తమ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, తనపై నిత్యం విషం చిమ్మే మీ చానళ్లలో నిరంతరం డిబేట్‌లు పెట్టి తాను నాస్తికుడనని, క్రైస్తవుడినని, అవినీతిపరుడనని, టీడీఆర్ బాండ్లలో రూ.వేల కోట్లు దండుకున్నానని విష ప్రచారం చేయడమే తప్ప ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. నాస్తికునికి, క్రైస్తవునికి మధ్య తేడా తెలియని బీఆర్ నాయుడు తిరుమలలో ఏఐ టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగిస్తారో అర్థం కావడంలేదన్నారు. తనపై మీ అంబాడాలన్నీ అబద్ధాలు అయినందున మీ భజన నాయుడుతో తిట్టించడం తప్ప, మీరు చేసి ఒక మంచి పని చెప్పండి బొల్లినేని రాజగోపాల్‌నాయుడు అని నిలదీశారు. శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తానని ప్రగల్భాలు పలికారు.. శ్రీవాణి లేకపోతే రాష్ట్రంలో, దేశంలో ఆలయాలు కట్టగలరా? అని ప్రశ్నించారు. తాము తీసుకున్న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు నిర్ణయం అత్యద్భుతమైనదని, దానిని మీరు రద్దు చేయలేరన్న విషయం చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. ఏఐ టెక్నాలజీతో దర్శనం కల్పిస్తామని చెప్పిన బీఆర్ నాయుడు బోర్డు సమావేశంలో మూడో కాంప్లెక్స్ నిర్మాణం నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. టీటీడీలో మీ మాట చెల్లదని, మీ మాట వినే అధికారులెవరూ లేరన్న విషయం దేశమంతా కోడై కూస్తోందన్నారు.

మీ చేతగానితనానికి నిదర్శనం

మఠాలకు నోటీసులు ఎందుకు ఇచ్చారని, మఠాధిపతులను అవమానించకండని మాట్లాడినందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేయడం మీ చేతగానితనానికి నిదర్శనమన్నారు. మఠాధిపతులేమైనా మీ దృష్టిలో తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా? అని మండిపడ్డారు. గతంలో కరుణాకరరెడ్డి అరెస్టయ్యారంటూ తానేదో నేరం చేసినట్లు చెబుతున్నారని, అయితే అతి చిన్నవయసులోనే సమాజం కోసం జైలుకు వెళ్లినందుకు గర్వపడుతున్నానన్నారు. వైకుంఠ టోకెన్ల జారీలో తొక్కిసలాట కారణంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పమన్నారన్న కక్షతో పవన్‌కళ్యాణ్‌కు సన్నిహితులైన శ్రీనివాసమంగాపురంలోని బాలాజీ దీక్షితులు, అదే సామాజిక వర్గానికి చెందిన చీర్ల కిరణ్‌కు మెమోలు ఇచ్చారే తప్ప వారు మరో తప్పిదాలేమీ చేయలేదన్నారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు వచ్చాకే తిరుమల పవిత్రత మంటగలిసిందని, అనేక అపచారాలతో టీటీడీని భ్రష్టుపట్టించారని ఆరోపించారు.

10 రోజుల్లో సమాధానం ఇవ్వండి

- విశ్రాంత తహసీల్దార్, ఏఆర్ఐ, వీఆర్వోలపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తవణంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన తనిఖీల నివేదికల ఆధారంగా ఒక తహసీల్దార్, ఏఆర్ఐ, వీఆర్వోలకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని తవణంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 2022వ సంవత్సరం జూన్ 6వ తేదీన ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారన్నారు. ఏసీబీ అధికారులు అప్పట్లో నిర్వహించిన తనిఖీల్లో ఆ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు అధికారుల తప్పిదాలను ప్రభుత్వానికి నివేదికల రూపంలో అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో అప్పట్లో విధులు నిర్వహించిన అధికారులకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీచేశారు. ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న మోహనవల్లి (ప్రస్తుతం ఆమె ఉద్యోగ విరమణ పొందారు), అడిషనల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ బత్తిని గోవర్ధన్ యాదవ్, వీఆర్వో గంటపార సుబ్రహ్మణ్యం, గ్రేడ్-1 వీఆర్వో సురేష్‌కుమార్, వెంకట ముని, కరుణాకరన్‌కు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ను విడి విడిగా జారీ చేశారు. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ అయిన అధికారులు 10 రోజుల్లోపు లిఖిత పూర్వకంగా సమాధానం తెలియజేయాలని పేర్కొన్నారు. వారిచ్చే సమాధానం పరిశీలించిన తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

సీఐ పిల్లచేష్టలు మానుకోవాలి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు వన్ టౌన్ సీఐ పిల్లచేష్టలు మానుకొని హుందాగా వ్యవహరిస్తే బాగుంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పలు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న సీఐ.. తనను లక్ష్యంగా చేసుకొని కుట్రల పన్నుతున్నారని ఆరోపించారు. కొంగారెడ్డిపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్దకు వన్ టౌన్ కు చెందిన తొమ్మిది మంది పోలీసులు బుధవారం వచ్చారన్నారు. ఓ కానిస్టేబుల్ తన జేబులో ఉన్న పేక ముక్కలు తీసి నిర్మాణం జరుగుతున్న చోట వేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆపై సీసీ కెమెరాలు చూసి అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. తన పేరు ప్రతిష్టకు భంగం కలిగించడానికి సీఐ పన్నుతున్న కుట్రలో భాగంగానే పోలీసు సిబ్బంది వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఆరోపణలన్నింటికీ కూడా తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఘటనపై ఎస్పీతో సహా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా ముందుకు వెళ్లనున్నట్లు విజయానంద రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

సీకాం డిగ్రీ కళాశాలకు 'అటానమస్'



కళాశాల భవనం

తిరుపతి సిటీ : అన్నమయ్య సర్కిల్‌లోని సీకాం డిగ్రీ కళాశాల మరో మైలురాయిని దాటింది. కళాశాలకు అటానమస్ హోదా లభించిందని విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవలే నాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని, అటానమస్ కోసం దరఖాస్తు చేసుకోగా యూజీసీ మా కళాశాలలో విద్యా నాణ్యతా ప్రమాణాలను, మౌలిక వసతులను పరిశీలించి హోదా కల్పించిందన్నారు. తిరుపతిలో అటానమస్ హోదా పొందిన తొలి డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి అధ్యక్షులు జయలక్ష్మి, డైరెక్టర్ ప్రణీత్ స్వరూప్, తేజ స్వరూప్ అభినందనలు తెలిపారు.

బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



డీఐఈవో రఘుపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంప్లాయీస్ సర్వీస్ సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఇంటర్మీడియట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ అసోసియేషన్ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇంటర్మీడియట్ డీఐఈవో రఘుపతిని కలిసి సత్కరించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో నాన్ టీచింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఐఈవో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగోన్నతులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సెబాస్టియన్, ట్రెజరర్ మునిచంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమౌళి, సూపరింటెండెంట్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం
– అడ్డుకుని జేసీబీని సీజ్ చేసిన తహసీల్దార్



సీజ్ చేసిన జేసీబీ యంత్రం

పూతలపట్టు(యాదమరి) : అక్రమంగా మట్టిని తరలించే క్రమంలో ప్రభుత్వ భూమిలో చదును చేస్తున్న జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ రమేష్‌బాబు చెప్పారు. మండల పరిధి పి.కొత్తకోట రెవెన్యూ పరిధి టీ.కె.పల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వ సానుభూతిపరుడైన ఓ వ్యక్తి గత కొద్ది రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పక్కనే కమ్మగుట్ట సమీపంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని బుధవారం జేసీబీతో చదును చేయడం మొదలు పెట్టగా గమనించిన గ్రామస్తులు స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి వెళ్లి జేసీబీని సీజ్ చేశారు.

కుంకీ ఆపరేషన్



పలమనేరు కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న ఏనుగుల గుంపు(ఫైల్)



మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీలు

- పంటలపైకి ఏనుగులు రాకుండా మళ్లించడమే ఇప్పటి దాకా
- క్యాప్చరింగ్‌తోనే మదుపుటేనుగల కట్టడి
- కర్ణాటకలో ఇప్పటికే సత్ఫలితాలు
- మదపు టేనుగుల దాడుల్లో ఇప్పటి దాకా 34 మంది మృతి
- మదపు టేనుగులను క్యాప్చరింగ్ చేస్తేనే సమస్య పరిష్కారం
- కార్యాచరణ చేపట్టనున్న అటవీశాఖ అధికారులు

పలమనేరు : జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా తీరని సమస్యగా మారింది. అడవిని దాటుతున్న ఏనుగులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అడవిని దాటి బయటకొచ్చిన ఏనుగులు సైతం వివిధ కారణాలతో మృతి చెందుతున్నాయి. అడవిలోంచి ఏనుగులు బయటకు రాకుండా కట్టడి చేసేందుకు ఇప్పటి దాకా అటవీశాఖ చేపట్టిన సోలార్ ఫెన్సింగ్, కందకాలు ప్రయోజనం లేకుండా పోయాయి.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు చేపట్టింది. ఇటీవలే టేకుమంద ఫారెస్ట్‌లో కుంకీ ఏనుగుల ట్రయల్ రన్ చేపట్టి అది విజయవంతమైందని అధికారులు చెబుతున్నారు. కానీ ఆడ ఏనుగులతో సమస్యలేదు గాని మదపుటేనుల కారణంగానే ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతోంది. వీటిని అదుపు చేయడమే కుంకీ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందుకోసం అత్యంత కీలకమైన ప్రక్రియ క్యాప్చరింగ్ మాత్రమే. మదపు టేనుగుల క్యాప్చరింగ్ త్వరలో చేపడతామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ప్రక్రియ జరిగి ఇక్కడి గుంపుల్లోని, ఒంటరిగా సంచరిస్తున్న మదపు టేనుగులను బంధిస్తేనే ఏనుగుల సమస్యకు చెక్ పెట్టినట్లు అవుతుంది.

ఇప్పటి వరకు 34 మంది ప్రాణాలు కోల్పోయారు

2012 నుంచి గతనెల 26న సోమలలో మృతి చెందిన క్రిష్ణంరాజు దాకా మొత్తం 34 మంది ప్రాణాలను కోల్పోయారు. ఏనుగుల దాడుల్లో 24 మందికి పైగా గాయపడ్డారు. ఏనుగుల బారిన పడి 63 పశువులు మృతి చెందాయి. ఈ దాడులను ఎక్కువగా చేసింది మదపుటేనుగులే కావడం గమనార్హం.ఇక ఏనుగుల కారణంగా 8602 ఎకరాల పంటలు నాశనమయ్యాయి. ఇక ఏనుగులు అడవిని దాటి బయటకొచ్చి ఇప్పటి దాకా 24 కరెంట్ షాక్‌లు తదితర కారణాలతో మృతి చెందాయి.

లక్ష్యం ఇదీ...

కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కుంకీ ఆపరేషన్లు కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. అక్కడ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు దుబేరా బేస్ క్యాంపు నుంచి నాలుగు కుంకీ ఏనుగులు, రామకుప్పం ననియాల నుంచి రెండు ఏనుగులను తెప్పించారు. వీటికి ఈ ప్రాంతాన్ని అలవాటు చేసి ఆపై అడవిలోని ఏనుగులకు కట్టడి చేయాలి. ఇందులో అత్యంత ముఖ్యమైన పని క్యాప్చరింగ్. అంటే మదపు టేనుగులను గుర్తించి వాటికి మత్తుచ్చి కుంకీల సాయంతో క్యాంపునకు తీసుకొచ్చి ఇక్కడి ఎలిఫెంట్ క్రాల్స్‌లో బంధించాలి. ఆపై వీటికి ఆరు నెలలపాటు శిక్షణ ఇస్తే ఇవి కుంకీల మాదిరి దాడులు చేయకుండా పోతాయి.

ప్రస్తుతం జరుగుతున్నది ఏంటి?

ఇక్కడి క్యాంపులో అభిమన్యు, క్రిష్ణ, జయంత్, వినాయక, దేవా, రంజన్‌లున్నాయి. ఇటీవల సోమలలో రైతును ఏనుగులు చంపడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేఖత వస్తుందని ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీశాఖ హుటాహుటిన కుంకీ ట్రయల్ రన్ చేసి ప్రజల దృష్టిని మళ్లించిదనే మాట వినిపిస్తోంది. ఆ మేరకు టేకుమంద అడవిలో ఏనుగుల మళ్లింపునకు పూర్తి ఫిట్‌నెస్ కలిగిన క్రిష్ణ, జయంత్, వినాయక్‌లను మాత్రం మావటిల ద్వారా పంపారు. అడవిలోని ఏనుగుల గుంపును అక్కడి నుంచి కౌండిన్య ఫారెస్ట్‌లోకి మళ్లించారు. ఇది కేవలం ట్రయల్ రన్ మాత్రమే. దీంతోనే ఏనుగులను పూర్తి స్థాయిలో కట్టడి చేయలేరు.

మదపుటేనుగులు అదుపులోకి తెస్తేనే..

ప్రజల ప్రాణాలు తీస్తున్న వాటిలో 90 శాతం మదపుటేనుగులే. ఇవి చాలా ప్రమాదమైనవి. ప్రస్తుతానికి కొన్ని ఒంటరిగా సంచరిస్తుండగా మరికొన్ని గుంపుల్లో ఉన్నాయి. ఇక్కడి ఎలిఫెంట్ క్యాంపులోని దేవా, రంజన్ సైతం కుంకీలుగా మారాలి. అప్పుడు కుంకీలు నాలుగు దిశల్లో వెళ్లి గుంపులోని మదపు టేనుగులను అదుపుచేయాలి. ఆ సమయంలో మావటీలు మత్తు సూదిచ్చి దాన్ని బంధించి క్యాంపునకు తీసుకురావాలి. ఈ ప్రక్రియలో కుంకీల పని ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వాహనం ఎక్కించడం చేస్తాయి. ఇలా తీసుకొచ్చిన మదపు టేనుగులను క్యాంపులోని క్రాల్స్‌లో బంధించి మూడు నుంచి ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చాకే ఇవి కుంకీలుగా మారుతాయి. ఇలా మదపు టేనుగులన్నింటిని కట్టడి చేస్తేగాని ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాదు.



ఇటీవల టేకుమంద అడవిలోకి కుంకీలను ట్రయల్ ఆపరేషన్‌కు తీసుకెళ్తున్న మావటీలు

జిల్లాలో ఏనుగుల పరిస్థితి ..



పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంపు స్కెచ్

పలమనేరు, కుప్పం, పూతలపట్టు, పుంగనూరు పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ పైగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఏనుగుల సంచరిస్తున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తం 105 దాకా ఏనుగులుండగా ఇందులో కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీలోనే 56 దాకా గుంపులుగా ఉన్నాయి. ఇవిగాక పక్కరాష్ట్రాల నుంచి వలస ఏనుగులు ఇక్కడికి వస్తుంటాయి.

వచ్చిన చోటుకే మళ్లీ వస్తున్నాయి



మేం పొలం వద్ద కాపురం ఉంటున్నాం. ఓ మదపు టేనుగు మా పొలం వద్దకు ఇప్పటికే నాలుగైదు సార్లు వచ్చి పంటను తొక్కి నాశనం చేసింది. మొన్న వచ్చినప్పుడు ఇంటిని మొత్తం కూల్చేసింది. దీంతో మేము ఎలాగో తప్పించుకొని ప్రాణాలతో భయటపడ్డాం. కుంకీలో ఏమోగాని ఏనుగులు అడవిలోంచి బయటకు రాకుండా చేయాలి.

– చంద్రయ్య, బాధిత రైతు, ఇందిరానగర్

కుంకీ ఆపరేషన్స్ ద్వారా కట్టడి చేస్తాం



ఇటీవల టేకు మందలో కుంకీ ట్రయల్ ఆపరేషన్ సక్సెస్ అయింది. త్వరలో మదపు టేనుగుల క్యాప్చరింగ్ ప్రక్రియ చేపడతాం. ఇవి ఎన్ని ఎక్కడెక్కడ ఉన్నాయనే సర్వే చేస్తున్నాం. జిల్లాలో ఏనుగుల ప్రభావం ఎక్కువగా ఉండే నడుమూరు, ఐరాల, టేకుమంద, కీలపట్ల, కల్లూరు, దామలచెరువు ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించాం. కుంకీల ద్వారా ఈ ప్రాంతాల్లో ఏనుగుల మళ్లింపు చేస్తాం. ఇదంతా వెంటనే జరిగేపని కాదు. అయితే ఏనుగుల సమస్యను పరిష్కరించే దిశగా చూస్తున్నాం.

– భరణి, డీఎఫ్ఓ, చిత్తూరు

దశాబ్దాల సమస్య తీరితే చాలు..



గతంలో ఏనుగులను కట్టడి చేసేందుకు చేసిన పనులన్నీ లాభం లేకుండా పోయాయి. ఇప్పుడు కుంకీ ఏనుగులంటున్నారు. వీటితోనైనా ఇక్కడ ఏనుగుల సమస్య పరిష్కారమైతే చాలు. ముఖ్యంగా మదపు టేనుగుల కారణంగానే భయమెక్కువ. వీటిని కుంకీలు అదుపు చేస్తే చాలయ్యా. అధికారులు మా పక్కన సోలార్ లైట్లను బిగించాలి. ఇప్పటికే చాలా వరకూ ఆస్తులు నష్టపోయాం. పూర్తి స్థాయిలో కట్టడి చేస్తే అదే పదివేలు..

– పుష్పరాజ్, రైతు, ఏటిగడ్డ, పలమనేరు మండలం

ప్రతి ఫైల్ ఈ–ఆఫీస్‌లోనే పంపాలి

- పీజీఆర్ఎస్ వినతులు గడువులోపు పరిష్కరించాలి
- సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రతి ఫైల్ ను కచ్చితంగా ఈ–ఆఫీస్‌లోనే పంపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీని గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు కేసులకు వెంటనే కౌంటర్ ఫైల్ నమోదు చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రతి కార్యాలయం నుంచి ఈ–ఆఫీస్‌లో పంపిన ఫైల్స్ ఎన్ని? సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌ల వద్ద ఎన్ని ఫైల్స్ ఉన్నాయి? అనే అంశాలను సంబంధిత ప్రొ ఫార్మాలో తెలియజేయాలన్నారు. సమీక్షలో డీఆర్వో మోహన్‌కుమార్, డీఎఫ్‌వో భరణి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు మంత్రి సత్యకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న నిర్వహించే దేశ స్వాతంత్య్ర వేడుకలకు రాష్ట్ర వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఈనెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొననున్నారు. ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందేశాన్ని ఇవ్వనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయనున్నారు.

కూటమి పాలనలో మద్యం షాపులకే ప్రాధాన్యం



నారాయణస్వామి

వెదురుకుప్పం : కూటమి పాలనలో సర్కారు బడుల కంటే మద్యం దుకాణాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బడులను మూసి వేసే పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన విద్య పేదలకు అందుబాటులో లేకపోగా ఎక్కడ చూసినా బెల్టు షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతున్నట్లు ఆరోపించారు. గ్రామాల్లో సర్కారు బడులకన్నా సర్కారు మద్యం షాపులు, బెల్టు షాపులు ఎక్కువగా కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు ద్వారా సర్కారు బడుల రూపురేఖలు మార్చితే కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసినట్లు గుర్తు చేశారు. గతంలో పేదలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుత ప్రభుత్వం వివిధ కారణాల రీత్యా స్థాయి తగ్గించడంతో పాటు రద్దు చేసేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో వెదురుకుప్పంలో డిగ్రీ కళాశాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. అప్పట్లోనే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి నిధులు కూడా మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ కళాశాల ఉంటుందా లేదా అనే ప్రశ్నలు ఎదురవుతున్నట్లు చెప్పారు.

సాంకేతికతకు అనుగుణంగా మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు అవసరమని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సమగ్రశిక్షాశాఖ, రాష్ట్రీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఓసాట్ డిజిటల్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతికతను బట్టి విద్యా వ్యవస్థలో మార్పులు అవసరమన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని అభివృద్ధి చేసి పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఓసాట్ సంస్థ జిల్లాలోని కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో 22 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని ఓసాట్ డిజిటల్ స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎంపిక చేసిన పాఠశాలల టీచర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంపిక చేసిన పాఠశాలలకు 3 ల్యాప్‌టాప్స్, 25 ట్యాబ్‌లను అందించారు. సమగ్రశిక్షా శాఖ ఏపీసీ వెంకటరమణ, రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, ఓసాట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుధీర్ పాల్గొన్నారు.

పల్టీలు కొట్టిన కారు.. తప్పిన ప్రమాదం



వ్యవసాయ బావి పక్కన బోల్తా పడిన కారు

ఐరాల : మద్దిపట్లపల్లె సమీపంలోని వ్యవసాయ బావి అంచున ఓ కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ చేతికి గాయం కాగా పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. కడప జిల్లా ఖాజీపేటకు చెందిన పరమేశ్వర్, సుధాకర్, మరో ఇద్దరు స్నేహితులు బుధవారం తమ స్వగ్రామం నుంచి కారులో కాణిపాకానికి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని మద్దిపట్లపల్లె సమీపంలోని చెరువు కట్టపై మలుపు వద్ద కారు డ్రైవింగ్ చేస్తున్న పరమేశ్వర్ నిద్ర మత్తుతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి అంచున కారు బోల్తా కొట్టింది. దీంతో పరమేశ్వర్‌కు చేతికి గాయం కావడంతో పాటు కారు నుజునుజ్జు అయ్యింది. మిగతా వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది నవంబర్ 28వ తేదీ ఇద్దరు విద్యార్థులు ద్విచక్ర వాహనంలో వెళ్తూ ఈ బావిలో పడి ఒకరు మృతి చెందగా మరొక విద్యార్థి క్షేమంగా బయటపడ్డాడు. చెరువు కట్టపై ఉన్న మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సెలవుపై చిత్తూరు ఎస్పీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎస్పీ మణికంఠ వ్యక్తిగత కారణాల రీత్యా సెలవులు తీసుకోనున్నారు. గురువారం నుంచి వారం రోజులపాటు సెలవులో వెళ్లనున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక తప్పులు లేని ఓటరు జాబితా



జీడీ నెల్లూరు నియోజకవర్గంలో బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న అధికారులు(ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటరు జాబితా పూర్తి స్థాయి ప్రక్షాళన దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయి సిబ్బందికి ఇటీవల శిక్షణ ఇచ్చారు. బీహారులో ఓటరు జాబితాల్లో లోపాలు గుర్తించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రక్షాళన చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.


ఏటా ఓటరు జాబితా సంక్షిప్త సవరణ

ఏటా ఓటరు జాబితాను సంక్షిప్త సవరణ చేస్తున్నారు. లోపాలు సరిచేయకపోవడంతో పాటు ఎన్నికల సమయంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటి నుంచే జాబితాను పూర్తి స్థాయి పరిశీలించి లోపాలు గుర్తించి సమగ్రమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలనేది ఎన్నికల సంఘం ఉద్దేశం. జిల్లా వ్యాప్తంగా బీఎల్‌వోలకు గత నెలలో ఆయా నియోజకవర్గాల ఆర్‌వోల పరిధిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సమగ్రమైన ఓటరు జాబితా తయారీకి బీఎల్‌వో లతో పాటు రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. సెప్టెంబరులో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇందుకు గాను తక్షణమే బీఎల్‌వోలు, సూపర్ వైజర్ల ఖాళీలు భర్తీ చేయాలని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన

జిల్లాలో ప్రస్తుతం 15,72,542 మంది ఓటర్లు ఉండగా 1776 పోలింగ్ కేంద్రాలున్నాయి. ప్రస్తుతానికి రాజకీయ పార్టీల ఏజెంట్లు 4,857 మంది ఉన్నారు. వీరంతా కలిసి ఓటర్లు స్థానికంగా ఉంటున్నారా లేదా, వలస వెళ్లారా శాశ్వతంగా వలస వెళ్లారా, తాత్కాలికమా తదితర అంశాలను పరిశీలించనున్నారు.

బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ



జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఎల్‌వోలకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిక్షణలు పూర్తి చేయడం జరిగింది. తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఎన్నికల సంఘం ఇచ్చే ఆదేశాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వెల్లడిస్తున్నాం.

– మోహన్ కుమార్, డీఆర్వో, చిత్తూరు

పెయ్య దూడల ప్రదర్శన



పెయ్య దూడల ప్రదర్శనలో పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యులు

గుడిపాల : మండలంలోని బొమ్మసముద్రంలో బుధవారం సంకరజాతి పెయ్యదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు సుబ్బారావు, సాయిసుధ, రవితేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెయ్య దూడల్లో జెర్సీ జాతి ఆవులను అభివృద్ధి చేయడం వల్ల పాలదిగుబడి పెరుగుతుందన్నారు. దీంతో పాటు ఇక్కడ వాతావరణానికి జెర్సీ ఆవులు అనుకూలంగా ఉంటుందన్నారు. హెచ్ఎఫ్ ఆవులు వేసవి సరిగ్గా తట్టుకోలేని పరిస్థితులు ఎదురవ్వడంతో పాటు పాలరేట్లు కూడా సరిగ్గా రావని తెలియజేశారు. అనంతరం 92 దూడలు ప్రదర్శనకు రావడం జరిగింది. ఇందులో ముగ్గురికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జ్ఞానశ్రీ, అబ్దుల్లా, సంగీత, కిషోర్, తులసి, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'భవిత'లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



పిల్లల సామర్థ్యాలపై ఆరా తీస్తున్న మధు

గుడిపాల : భవిత కేంద్రంలోని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సహిత విద్య కోఆర్డినేటర్ మధు తెలిపారు. బుధవారం ఆయన నరహరిపేట హైస్కూల్‌లో ఉన్న భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు కల్పిస్తున్న వసతులపై ఆయన ఆరా తీశారు. పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, స్పీచ్ తెరపి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి పిల్లల సామర్థ్యాలపై ఆరా తీశారు. గతంలో ప్రస్తుత స్థితిగతులు, ఫిజియోథెరపీ వల్ల కలిగే లాభాల గురించి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంఇఓలు హసన్‌భాషా, గణపతి, ఎఎస్ఓ చాంద్‌బాషా, హెచ్ఎం దూర్వాసు పాల్గొన్నారు.

సాంకేతికతపై ఆసక్తి చూపించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతికతపై ఆసక్తి చూపించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం నగర సరిహద్దులో ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ స్పేస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి వైజ్ఞానిక ప్రపంచంలో విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు ఆసక్తి చూపించాలన్నారు. భారత ప్రభుత్వం 2023వ సంవత్సరంలో చంద్రయాన్–3ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా నేషనల్ స్పేస్ డే కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. రెండు రోజులు నిర్వహించుకునే ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనేక కొత్త విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రపంచం సాంకేతికమయం అయిందన్నారు. ప్రస్తుత ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే తరగతి గదులలో విద్యతో పాటు అదనంగా జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులు 9 వ తరగతి నుంచే అదనపు జ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబోరేటరీ సహకారంతో విద్యార్థులకు త్వరలో 50 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంతరిక్ష పరిశోధనలపై తెలియని అంశాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. శార్ జీఎం కృతివాసన్ మాట్లాడుతూ.. ఇటీవల జీఎస్ఎల్‌వీ ఎఫ్–16 ప్రయోగం విజయవంతం అయినట్లు తెలిపారు. ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో చంద్రయాన్–4 ప్రయోగంకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం



సచివాలయంలో ఏర్పాటు చేసుకున్న ఎమ్మెల్యే ఫొటో

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు నగరంలో కొందరు టీడీపీ నాయకులు చూపిస్తున్న అత్యుత్సాహం విమర్శలకు దారితీస్తోంది. సంతపేటలోని పలు సచివాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోల పక్కనే స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ఫొటోలను ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం. చిత్తూరులో సంతపేటకు చెందిన టీడీపీ నాయకులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పలు సచివాలయాల్లో అధికారుల అనుమతి తీసుకోకుండా ఎమ్మెల్యే ఫొటోలను తీసుకెళ్లి సచివాలయంలో ఏర్పాటు చేయడం విమర్శలకు దారితీస్తోంది.